# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ:  25-02-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సాంకేతికత ఉపయోగంతో రోగుల చికిత్సలో ఖచ్చితత్వం పెరుగుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ ప్రపంచ అనిశ్చితి మధ్య కూడా భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రపంచ నిపుణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.
- ❖ భారత తీర రక్షక దళం సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- ❖ భారత్, ఇంగ్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇరుదేశాల సంబంధాల్లో ప్రధాన మైలురాయిగా నిలుస్తుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.
- ❖ రేపటితో మహా కుంభమేళా పవిత్ర స్నానాలు ముగియనున్నాయి.

========================

సాంకేతికతను ఉపయోగించడం వల్ల రోగుల చికిత్సలో ఖచ్చితత్వం పెరుగుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బీహార్ పాట్నాలోని ఈ రోజు జరిగిన పాట్నా వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. 5,400 కంటే ఎక్కువ పడకలతో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆసుపత్రిగా పాట్నా మెడికల్ కాలేజ్ అభివృద్ధి చెందడం పట్ల రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోని ఆరోగ్య సంరక్షణ సంస్థలలో మెరుగైన వైద్య సౌకర్యాల వికేంద్రీకరణ, మరిన్ని పరిశోధనలు అవసరమని రాష్ట్రపతి తెలియజేస్తూ..

(వాయిస్ 34 సెకన్లు)

========================

ప్రపంచ అనిశ్చితి మధ్య కూడా భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రపంచ నిపుణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గౌహతిలో అడ్వాంటేజ్ అస్సాం 2.0 పెట్టుబడుల, మౌలిక

సదుపాయాల శిఖరాగ్ర సమ్మేళనాన్ని ఈ రోజు ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. నేటి భారతదేశం 21వ శతాబ్దపు దీర్ఘకాల దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేస్తుందని అన్నారు. నిరంతర సంస్కరణలతో సాగుతున్న భారతదేశ పాలనను, అత్యంత వేగంగా నైపుణ్యం పొందుతున్న యువ జనాభాను, నూతన మధ్యతరగతిని ప్రపంచం ఇప్పుడు విశ్వసిస్తోందని నరేంద్రమోదీ తెలియజేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

=======================

అస్సాం రాష్ట్రం భారతదేశపు చోదక శక్తిగా నిలుస్తుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈ రోజు అస్సాంలోని గౌహతిలో అడ్వాంటేజ్ అస్సాం 2.0 పెట్టుబడుల, మౌలిక సదుపాయాల శిఖరాగ్ర సమ్మేళనంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... జాగిరోడ్‌లోని సెమీకండక్టర్ ప్లాంట్ అస్సాంను సెమీకండక్టర్ హబ్‌గా మారుస్తుందని పేర్కొన్నారు. గౌహతిలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో అత్యాధునిక ఐటీ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

=======================

భారత్, ఇంగ్లాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇరుదేశాల సంబంధాల్లో ప్రధాన మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఇంగ్లాండ్ సెక్రటరీ ఆఫ్ బిజినెస్, ట్రేడ్ జోనాథన్ రేనాల్డ్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో కేంద్రమంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో, ఇరుపక్షాలు పరస్పర ప్రయోజనకరమైన, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వేగవంతం చేయడంలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించాయి. ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి భారత ప్రభుత్వ నిబద్ధతను పియూష్ గోయల్ పునరుద్ఘాటించారు.

=======================

ఉత్తప్రదేశ్ - ప్రయాగ్రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళా పుణ్య స్నానాలు రేపటితో ముగియనున్నాయి. జనవరి 13న మొదలైన ఈ కుంభమేళాలో ఇప్పటివరకు పవిత్ర త్రివేణి సంగమంలో 60 కోట్లకు మందికి పైగా పుణ్యస్నానాలు ఆచరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇక, రేపు మహాశివరాత్రి పర్వదినం రావడంతో భక్తుల రాక మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

=======================

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ మేళాలో డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను 3 లక్షల 50 వేల మంది భక్తులు సందర్శించారు. ఆధునిక సాంకేతికతతో ప్రాచీన పౌరాణిక గాథలకు ఆధ్యాత్మికతను మేళవించిన కేంద్రం ఇది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ కూడా డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో మహాకుంభ్ వైభవాన్ని ఆస్వాదించారు. మహాకుంభ జాతర ప్రాంతంలోని సెక్టార్-4లో నిర్మించిన డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఆధ్యాత్మిక మెగా - ఈవెంట్‌లో కీలకంగా నిలిచింది. ముఖ్యంగా యువ సందర్శకులను, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించిన ఈ కేంద్రం 1 కోటి 75 లక్షల రూపాయల ఆదాయాన్ని ఆర్జించింది. డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ప్రశంసిస్తూ... ఇది వారసత్వం, సాంకేతికత మధ్య వారధి అని పేర్కొన్నారు.

విరామం

=======================

భారత తీర రక్షక దళం సామర్థ్యాన్ని పెంపొందించడానికి కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో భారత కోస్ట్ గార్డ్ సిబ్బందికి శౌర్యం, విశిష్ట సేవ మెరిటోరియస్ సర్వీస్ పతకాలను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2025-26 ఆర్థిక సంవత్సరానికి కోస్ట్‌గార్డ్‌కు 9 వేల 676 కోట్ల రూపాయలు కేటాయించామని, ఇది గత సంవత్సరం బడ్జెట్‌తో పోలిస్తే 26.6 శాతం ఎక్కువని తెలిపారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన మెరైన్ దళాలలో ఒకటిగా ఉందని రాజనాధ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

======================

బంగాళాఖాతంలో ఈ రోజు ఉదయం 6 గంటల 10 నిమిషాలకు రిక్టర్ స్కేలుపై 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో ఒడిశాలోని పలు ప్రాంతాల్లో స్వల్పంగా ప్రకంపనలు వచ్చాయి. సముద్ర ఉపరితలానికి 91 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించింది. ఒడిశాలోని భువనేశ్వర్, పూరీ, పారాదీప్, బరిపడ, సంబల్‌పూర్, అంగుల్, కేంద్రపారా, జగత్ సింగ్‌పూర్, బాలాసోర్‌లో భూ ప్రకంపనలు సంభవించడంతో ఆయా ప్రాంత వాసులు భయాందోళనకు గురయ్యారు. భూకంప సమాచారం ప్రకారం, భూకంప కేంద్రం పూరీ నగరానికి తూర్పున 286 కిలో మీటర్లు, భువనేశ్వర్‌కు తూర్పు-ఆగ్నేయంగా 297 కిలో మీటర్లు, బెర్హంపూర్‌కు తూర్పున 394 కిలో మీటర్ల దూరంలో ఉంది.

======================

ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల్లో ఈ రోజు 21 మంది ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభ్యులను స్పీకర్ విజయేందర్ గుప్తా సస్పెండ్ చేశారు. ఈరోజు ఉదయం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సభను ఉద్దేశించి ప్రసంగిస్తున్నప్పుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఛాంబర్ నుండి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భగత్ సింగ్ చిత్రపటాలను తొలగించడంపై ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. ఈ ఆరోపణలను అధికార బీజేపీ ఇప్పటికే తోసిపుచ్చింది. స్పీకర్ విజయేందర్ గుప్తా పలు మార్లు కోరినప్పటికి ప్రతిపక్ష సభ్యులు నిరసన కొనసాగించడంతో వారిని సస్పెండ్ చేశారు.

======================

జమ్మూ కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థలో పర్యాటకం కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... గొప్ప సాంస్కృతిక వారసత్వం, వ్యూహాత్మక ప్రదేశం కలిగిన ఉన్న జమ్మూ కాశ్మీర్ పర్యాటకులను ఆకర్షించడానికి స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంచడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

======================

భారత వాతావరణ శాఖ (IMD) ముంబై, థానే, మహారాష్ట్రలోని పొరుగు జిల్లాల్లో రెండు రోజుల పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని అప్రమత్తం చేసింది. 37 నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ శాస్త్రవేత్త (సైంటిస్ట్) సుష్మా నాయర్ తెలిపారు. ఈరోజు, రేపు ముంబై, థానే, రత్నగిరి, రాయ్‌గఢ్ లకు హీట్‌వేవ్ అలర్ట్ జారీ చేసింది. ఫిబ్రవరిలో సాధారణ ఉష్ణోగ్రత కంటే అత్యధికంగా 37-38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ముంబై, సమీప ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ప్రమాద హెచ్చరికలు జారీ చేసినట్లు IMD తెలిపింది. ఈనెల 27, 28 తేదీలలో ఇది 1-2 డిగ్రీలు తగ్గే అవకాశం ఉన్నా, అధిక ఉష్ణోగ్రత నుండి పెద్దగా ఉపశమనం కలగకపోవచ్చని పేర్కొంది.

======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిశాయి. సెన్సెక్స్  74,454 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరకు 147 పాయింట్ల లాభంతో 74,602 వద్ద ముగిసింది. నిఫ్టీ 5 పాయింట్లు నష్టంతో 22,547 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 87.21 వద్ద ముగిసింది.

========================

========================